1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

మంగళవారం | మే 28, 2024 | www.navatelangana.com

ప్రజల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి

నవతెలంగాణ-నిజాంసాగర్



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

ప్రజల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు అందరూ సమన్వయంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగనీయకుండా పనిచేయాలని ఆమె అన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మనోహర్, అచ్చంపేట సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీడీవో గంగాధర్, తహసీల్దార్ బిక్షపతి, వ్యవసాయ శాఖ ఏవో అమర్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్తాచెదారం

- మున్సిపల్ కార్యాలయం సమీపంలోనే..

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో చెత్త చెదారం పేరుకుపోయి అపరిశుభ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది. మున్సిపల్ పరిధిలో ఏ వార్డులో చూసినా.. శుభ్రత లోపించి కనిపించడంతో స్థానికులు మున్సిపల్ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు అసంపూర్ణంగా చేసిన పనుల గురించి స్థానికులు ప్రశ్నిస్తే దురుసుగా వ్యవహరిస్తూ సమాధానమిస్తున్నారు. పారిశుధ్య పనులను సంపూర్ణంగా చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మైనర్ బాలికపై లైంగికదాడికి యత్నం

నవతెలంగాణ-మోపాల్

మైనర్ బాలికపై లైంగికదాడికి యత్నించాడు ఓ వికలాంగుడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక (6)ను అదే గ్రామానికి చెందిన వికలాంగుడు (23) లైంగికదాడికి యత్నించాడు. అదే సమయంలో తల్లి గమనించి బాలికను తీసుకెళ్లింది. దీంతో ఆగ్రహించిన పలువురు ఆ వికలాంగుడిపై దాడి చేసి ఇంట్లో సామగ్రిని తగులబెట్టారు.

కౌంట్‌డౌన్ షురూ



- 7 రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు
- చివరి దశకు చేరుకున్న ఎన్నికల ప్రక్రియ
- రోజులు దగ్గర పడుతున్నకొద్ది అభ్యర్థుల్లో టెన్షన్
- గెలుపుపై ఇప్పటికీ అస్పష్టతే..
- ఎవరి లెక్కలు వారివే..
- మెజార్టీ ఏమో గానీ గెలిస్తే చాలని నిట్టూర్పు

నవతెలంగాణ-నిజామాబాద్

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలకు కౌంట్ డౌన్ షురూ అయ్యింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆరో విడుత ఎన్నికలు కూడా పూర్తికావడంతో ఎన్నికల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. జూన్ 1వ తేదీన చివరి విడుత ఎన్నికలు జరగనున్నాయి. ఇక 7 రోజుల్లో ఎన్నికల ఫలితాలు రానున్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నా.. రోజులు దగ్గర పడుతున్నా కొద్దీ అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. మొదట్లో గెలుపుపై ధీమాగా ఉన్నప్పటికీ ఎన్నికల అనంతరం, ఓటింగ్ సరళిని చూస్తే ఎవరికీ గెలుపుపై స్పష్టత రావడం లేదు. ఎవరూ ఎన్నీ లెక్కలు వేసుకున్నా.. గెలుస్తామన్న నమ్మకం కలగడం లేదు. దాంతో మెజార్టీ ఏమో గానీ గెలిస్తే చాలనే భావనకు అభ్యర్థులు వచ్చినట్టు తెలుస్తోంది. అభ్యర్థుల మధ్య నువ్వా-నేనా అన్నట్టు పోటీ ఉండడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు.

నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో సగటు 71.92 శాతం పోలింగ్ శాతం నమోదు అయ్యింది. మొత్తం 17,04,867 మంది ఓటర్లకు గాను 12,26,133 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 6,73,629 మంది మహిళలు, 5,52,465 మంది పురుషులు, 39 మంది ఇతరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ద్విముఖ పోరు..

ఎన్నికల ప్రచారం వేళ.. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ ఉంటుందని అంతా భావించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు నువ్వా-నేనా అన్నట్టు ప్రచారం నిర్వహించారు. అయితే పోలింగ్ ముగిసిన తరువాత త్రిముఖ పోరు కాస్తా ద్విముఖ పోరుగా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పెరిగిన పోలింగ్ శాతం, పోలింగ్ సరళీని బట్టి చూస్తే బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీగా పోటీ పడ్డాయి. అయితే ఎవరూ గెలుస్తారు అనేది మాత్రం ఎవరూ అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఒక్కో ప్రాంతంలో ఒక్కో పార్టీ బలంగా ఉంది. అర్బన్ ప్రాంతంలో బీజేపీ బలంగా ఉండగా.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచిన చోట కాంగ్రెస్ బలంగా ఉంది. అలాగే బీఆర్ఎస్ నుంచి క్రాస్ ఓటింగ్ జరిగిందనే ప్రచారం జరిగింది. దాంతో ఎవరూ గెలుస్తారనే దానిపై అభ్యర్థులు సైతం ఎటూ తేల్చకోలేకపోతున్నారు. ఇక జహీరాబాద్‌లో కాంగ్రెస్, బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. బీబీపాటిల్‌పై వ్యతిరేకత ఉన్నా.. జుక్కల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో కొంత ప్రభావం చూపారు.

కౌంట్‌డౌన్ షురూ..

ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడనున్నాయి. దీనికి కేవలం ఇంకో 7 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. మరి కొద్ది రోజుల్లో ఎవరి భవితవ్యం ఏంటో తేలిపోనుంది. ఫలితాల సమయం దగ్గర పడుతున్న కొద్ది అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంటోంది. వారి అంచనాలు ఫలిస్తాయా.. తారుమారు అవుతాయా.. అనే దానిపై అభ్యర్థులు మల్లగుళ్లలు పడుతున్నారు. వారు అంతర్గతంగా చేయించుకున్న సర్వేలు, పార్టీ నాయకుల ద్వారా తెప్పించుకున్న రిపోర్టులల్లో కూడా స్పష్టత లేకపోవడంతో కొంద ఆందోళనకు గురవుతున్నట్టు సమాచారం. ఎన్నికల ప్రక్రియ చివరి దశకు చేరడంతో మొదట్లో మెజార్టీపై లెక్కలు వేసుకున్న పార్టీలు ఇప్పుడు గెలిస్తే చాలు అనే భావనకు వచ్చినట్టు తెలుస్తోంది. మరి గెలుపు ఎవరిని వరిస్తుంది. ఎవరు ఓటమి రుచి చూస్తారనేది తెలియాలంటే జూన 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

ముఖ్యమంత్రి (సీఎంఓ) కార్యాలయం నుంచి వచ్చే ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ముఖమంత్రి (సీఎంఓ) కార్యాలయం నుంచి వచ్చే ప్రజావాణి ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించవలసినదిగా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టిపెట్టారని, త్వరలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని అన్నారు. సిఎంఓ కార్యాలయం నుంచి జిల్లాకు సంబంధించి 382 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని ప్రత్యేకశ్రద్ధతో పరిశీలించి సంతృప్తి చెందిన మీదట వెంటనే పరిష్కరించాలన్నారు. దరఖాస్తు తిరస్కరణ లేదా పరిష్కరించక పోవడానికి సాహేతుకమైన కారణాలుంటే ఫిర్యాదీదారుకు సకాలంలో తెలపాలని, ఎట్టి పరిస్థితులలో తమ వద్ద అనవసరంగా పెండింగ్‌లో పెట్టుకోరాదని స్పష్టం చేశారు. ఇంతవరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు రాగా ఇప్పటి నుంచి సంబంధిత శాఖకు జూతీఖయిఖ-ఝఖఅఱంఅశీఏప్రముఖుశ్రీ.షిఏ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు పంపుతారని, ఇందుకోసం ప్రతి శాఖాపర నోడల్ అధికారికి కొత్తగా లాగిన్ ఐడి ఇస్తారని, ఆన్‌లైన్‌లోనే సమాధానం పంపాలని చంద్ర మోహన్ తెలిపారు. డౌన్‌లోడ్, రిప్లై పంపడంలో సాంకేతిక సలహాలకు ఈడిఎమ్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ. మసూర్ అహ్మద్, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అమ్మ ఆదర్శ పాఠశాల

పనులు పూర్తి చేయాలి

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయగౌడ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మాట్లాడుతున్న అభివృద్ధి అధికారి సాయగౌడ్

పాఠశాల ప్రారంభమయ్యేలోపే అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపడుతున్న పనులను పూర్తిచేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని నాగపూర్, కమ్మర్‌పల్లి, హసకొత్తూర్, బషీరాబాద్, కేసీ తాండ, విజే తాండ, ఇనాయక్‌నగర్, నర్సాపూర్, కోన సముందర్ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపట్టిన పనులను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న గదుల మరమ్మతు, మరుగుదొడ్ల మరమ్మతు, తాగునీటి సౌకర్యం, విద్యుదీకరణ పనుల తీరును పరిశీలించారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, పలు పాఠశాలల పనులు ముగింపు దశలో ఉన్నాయని, మిగిలిన పనులను కూడా వారం రోజుల్లో పూర్తి చేస్తే బిల్లులు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. జరుగుతున్న పనుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ నెల 30వ తేదీలోపు పనులన్నీ వంద శాతం పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, కుంట గంగారెడ్డి, ఏపీఎం కుంట గంగారెడ్డి తదితరులున్నారు.

బడితెరిచే నాటికి స్కూల్ యూనిఫామ్ సిద్ధం చేయాలి..

ప్రభుత్వ పాఠశాలలు తెరిచే జూన్ 12వ తేదీ నాటికి ఏకరూప దుస్తులను కుట్టించి తయారు చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకెపి టైలరింగ్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సాయా గౌడ్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కమ్మర్‌పల్లి మండలానికి బాలికలకు సంబంధించిన డ్రస్ మెటీరియల్ ఇవ్వడం జరిగిందని మరో రెండు రోజుల్లో మిగతా డ్రెస్ మెటీరియల్ కూడా అందజేస్తామని తెలిపారు. 15 రోజుల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టి మండల వ్యాప్తంగా సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, కుంట గంగారెడ్డి, ఏపీఎం కుంట గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌ను మూసేయాలి

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ప్రభాకర్
- కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసిన నాయకులు

వైద్యం కోసం వచ్చిన మహిళల అసభ్య ఫొటోస్, వీడియోలు చిత్రీకరించి మహిళల ఆత్మాభిమానం దెబ్బతీసిన అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌ను మూసివేయాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యకోసం వచ్చిన మహిళలను అసభ్యకరంగా ఫొటోస్, వీడియోస్ తీసి బ్లాక్ మెయిల్ చేయడం మహిళలను మానసికంగా వేధించడం సిగ్గుచేటన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బాన్సువాడ, బోధన్, కామారెడ్డి నగరాల్లో స్కానింగ్ సెంటర్స్ పేరిట ప్రజల్ని నిలువుదోపిడీ చేస్తున్నాయని విమర్శించరు. ఎలాంటి శిక్షణలేని వారిని టెక్నీషియన్స్‌గా, సిబ్బందిగా పెట్టుకొని మహిళల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. డాక్టర్స్ లాభాపేక్షతోని వైద్యాన్ని వ్యాపారం చేసి ప్రజల్ని నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయకూడదని చట్టం ఉన్నా.. ఎక్కడ కూడా పట్టించుకోవడంలేదని డబ్బులు తీసుకొని, మరి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్నారు. వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తే డబ్బులు దండుకోవడమే కాకుండా మహిళల ఆత్మ అభిమానాన్ని దెబ్బతిస్తున్నారన్నారు. అనేక ప్రభుత్వ ఆసుపత్రులలో సర్టిఫైడ్ డాక్టర్స్ లేకున్నా డబ్బున్న వారు ఆస్పత్రులను నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. స్కానింగ్ సెంటర్స్ అన్నీ కూడా అక్రమంగా అన్యాయంగా, ప్రజలను ముఖ్యంగా మహిళల పట్ల నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని సెంటర్స్‌పై ప్రభుత్వం నిఘా పెంచి అక్రమ స్కానింగ్ సెంటర్స్‌పై చట్టబద్ధ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఐఎంఏ సైతం అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌కు వత్తాసుగా వకల్తు పుచ్చుకొని మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌పై చర్య తీసుకుని మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ, బి.దేవారం, ఆర్మూర్ డివిజన్ సాయి కార్యదర్శి ఆర్.రమేష్, నాయకులు బి.కిషన్, ఆర్.దామోదర్, జి.కిషన్, బి.అశోక్, ఎండి అనిస్ పాల్గొన్నారు.

పాఠశాలల మరమ్మతు పనులు నాణ్యతగా చేపట్టాలి

- మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ

నవతెలంగాణ-బోధన్

బోధన్ మున్సిపల్ పరిధిలో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పాఠశాలల అభివృద్ధి, మరమ్మతు పనులు నాణ్యతగా చేపట్టాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట్ నారాయణ అన్నారు. సోమవారం ఆయన బోధన్ పట్టణంలోని పాండుఫారం ఉర్దూ పాఠశాల, నర్సాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి అమ్మ ఆదర్శ కమిటీలలో భాగంగా నిధులు మంజూరు చేసిందని ఆ నిధులతో చేపట్టిన పనులను 10 కాలాలపాటు మన్నికగా ఉండేలా నాణ్యత చేపట్టాలని సూచించారు. లేనియెడల నాసిరకం పనులు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈలు శివకృష్ణ, శ్రీనివాస్ తదితరులున్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్



రైసుమిల్లును పరిశీలిస్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తికావొచ్చింది

- ఇంకా 40 కేంద్రాలలో మాత్రమే ధాన్యం మిగిలి ఉంది
- జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు

నవతెలంగాణ-కామారెడ్డి

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తికావొచ్చిందని ఇంకా 40 కేంద్రాలలో మాత్రమే ధాన్యం మిగిలి ఉందని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు అన్నారు. సోమవారం కామారెడ్డిలోని గురు రాఘవేంద్ర రైస్‌మిల్, మాచారెడ్డి మండలంలోని భావానిపేటలో శైవి రైస్ మిల్, లక్ష్మి గణపతి ఆగ్రో రైస్ మిల్, భూలక్ష్మి రైస్ మిల్, భిక్కనూర్‌లోని సప్తగిరి రైస్ మిల్లులను పౌర సరఫరాల ఇంచార్జ్ జిల్లా మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షిస్తూ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను, రైస్ మిల్లర్లను, కేంద్రాల నిర్వాహకులకు ఎప్పటికపుడు తగు ఆదేశాలిస్తూ మానిటరింగ్ చేస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాలలో లోడింగ్‌తో పాటు రైస్ మిల్లులలో అన్ లోడింగ్ వేగవంతంగా జరుగుతున్నదని వారు తెలిపారు. సోమవారం 104 లారీలు సమకూర్చి 2,494 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించామన్నారు. 310 కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 3 లక్షల 4వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాలో 603 కోట్లు జమచేశామన్నారు.

ఐకెపి.. కార్యాలయంలో ఆడిట్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల ఐకెపి కార్యాలయంలో సోమవారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ ప్రారంభమైనట్లు ఐకెపి ఏపీఎం జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆడిటర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. మండలంలో 32 గ్రామాల సంఘాల ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ సంఘాల్లో జరిగిన ఆర్థిక లావాదేవీల లెక్కలను పరిశీలించి పూర్తిస్థాయిలో నివేదిక ఈ నెల 31వ తేదీలోగా ఐకెపి కార్యాలయంలో ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు శాంత, సీసీలు శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, సాయిలు, అకౌంటెంట్ రాజు, రవి పాల్గొన్నారు.



ఆడిట్‌లో పాల్గొన్న పలువురు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

సంగారెడ్డిలోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచిన కామారెడ్డి, ఎలారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించిన గదులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం పరిశీలించారు. సిసి కెమెరా నిఘాలో, మూడంచెల భద్రత మధ్య సెగ్మెంట్ వారీగా ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో సీల్‌వేసి పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. ఈ స్ట్రాంగ్‌రూంలను సీఆర్పీఎఫ్, పోలీసు సిబ్బంది 24 గంటలు పర్యవేక్షణ చేస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించి జూన్ 4న గీతం యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు జరగనున్న విషయం విదితమే. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు సంసిద్ధతకు చేస్తున్న ఏర్పాట్లు, తీసుకుంటున్న ముందస్తు చర్యలపై న్యూఢిల్లీ నుండి కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్ కుమార్ జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంగారెడ్డి నుంచి ఆ జిల్లా కలెక్టర్, వల్లూరు క్రాంతితో కలిసి పాల్గొన్నారు. అనంతరం గీతం యూనివర్సిటీలో కామారెడ్డి జిల్లాకు సంబంధించిన అసెంబ్లీ సెగ్మెంట్ స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ పరిశీలించి విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతరం కొనసాగుతున్న భద్రతాచర్యలను అక్కడ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ద్వారా పరిశీలించారు.

మహిళా రైతులకు అవగాహన సదస్సు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జైతాపూర్, దుబ్బతండా గ్రామాలలో గల మహిళ రైతులకు ఖరీఫ్ సీజన్లో వరి విత్తనాలతో పాటు ఆరుతడి పంటలు వేస్తున్న నేపథ్యంలో విత్తనాలు అమ్మకాలు జరిపే డీలర్ల వద్ద రసీదు తప్పకుండా పొందాలని ఆయన సూచించారు. నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని ఆయన రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అనవసరంగా గుర్తింపు లేని దుకాణ యాజమాన్యాల వద్ద వరి విత్తనాలతో పాటు ఆరుతడి పంటల విత్తనాలను కొనుగోలు చేయకూడదని ఆయన అన్నారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకూ బిల్లును తప్పకుండా తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యా సంవత్సరంలో ఫీజుల దోపిడీని అరికట్టాలి



వినతిపత్రం అంజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న వేళ ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాల ఫీజుల దోపిడీని అరికట్టాలని, అదేవిధంగా ఫీజులో నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, అనుమతి లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ వి దుర్గాప్రసాద్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జీవన్ రాథోడ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలో బుక్స్, యూనిఫామ్స్ అమ్మకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యాదవ సాయికృష్ణ పాల్గొన్నారు.

బీడీ కార్మికుల వేతన ఒప్పందమైంది

- ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ముత్తెన్న



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయు నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

బీడీ కార్మికుల వేతన ఒప్పందమైందని ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ముత్తెన్న తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల అగ్రిమెంట్ 25.4.24తో ముగిసిందని, నూతన వేతనాల ఒప్పందం గురించి బీడీ కంపెనీ యజమానులతో డిమాండ్ లెటర్ ఇచ్చినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బీడీ, కార్మిక సంఘాలు, కలిసి వేతన ఒప్పంద చర్చలు జరిపి బీడీలు చుట్టే కార్మికులకు వేతనంపై రూ.4.25 పెంచిందని, మొత్తం 1000 బీడీలకు మొత్తం కలిపి రూ.49.98 పైసలు అయిందని వివరించారు. బీడీ ప్యాకింగ్ కార్మికుల నూతనంగా రూ.3650, చేటన్, బట్టివారి, చెన్నివల, ట్రై ఫిల్లర్స్ , క్లర్క్సకు రూ.1700 పెంచారని తెలిపారు. ఈ వేతన ఒప్పందం బీడీ యజమానులు, బీడీ కార్మిక సంఘాలు శాంతియుతంగా చర్చలు జరిపి పరిష్కరించినటుట తెలిపారు. కార్యక్రమంలో సత్తెక్క, నజీర్, తూర్పాటి శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లీకేజీకి మరమ్మతులు

- నవతెలంగాణ కథనానికి స్పందన



లీకేజీని చేస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలోని ప్రధాన రహదారిపక్కన పైపు లీకేజీకి అధికారులు సోమవారం మరమ్మతు పనులు చేపట్టారు. పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథాగా పోయి.. రోడ్డు బురదమయంగా మారడంతో ఆ రోడ్డు గుండా రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో 'నవతెలంగాణలో పైప్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలి అనే శీర్షికన కథనం సోమవారం ప్రచురితమైంది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్‌సింగ్ స్పందించి గ్రామ పంచాయతీ అధికారికి మరమ్మతులు చేపట్టాలని సూచించడంతో మరమ్మతు పనులు సోమవారం చేపట్టారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తిచేయాలి

- అధికారులను ఆదేశించిన డిపిఓ తరుణ్ చక్రవర్తి



పాఠశాలను తనిఖీ చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-బాల్కొండ

పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు మండల పరిధిలోని అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తిచేయాలని డిపిఓ తరుణ్ చక్రవర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం బాల్కొండ మండల పరిధిలోని కిసాన్‌నగర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులున్నారు.

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

- జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

విత్తన విక్రయ దుకాణాలలో రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మండల పరిధిలోని విత్తనాలు, పురుగు మందులు అమ్మే డీలర్స్‌తో జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు దుకాణాలలో నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, పురుగు మందులు అమ్మే ప్రతి డీలర్ షాప్ లైసెన్సు దుకాణంలో కనిపించే విధంగా ఉంచాలన్నారు. విత్తనాలు అమ్మిన రిజిస్టర్‌ను రైతుల పేర్లతో రోజువారీగా నమోదు చేయాలని తెలిపారు. రైతులు కూడా విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు.

నెహ్రూ హయాంలో

ఆర్థిక వ్యవస్థ బలోపేతం



నిజామాబాద్ సిటీ : నివాళులర్పిస్తున్న నాయకులు



మెండోరాలో..

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో నెహ్రూ వర్ధంతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/మెండోరా

భారతదేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తన హయాంలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ నాయకులు అన్నారు. నెహ్రూ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ భవన్ నందు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లిన నాయకుడని, బ్రిటిష్ వారు దేశాన్ని పూర్తిగా దోచుకున్న తర్వాత భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మొదటిసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నెహ్రూ భారత దేశంలో ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించారని, పంచవర్ష ప్రణాళిక ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారని అన్నారు. నెహ్రూ భూ పున్షపంపిణి విధానాన్ని అనుసరించడంతో పాటు నీటిపారుదలకు కాలువలు తవ్వించడం, ఆనకట్టలు కట్టించడం, వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలకు ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. అదేవిధంగా నెహ్రూకు నిజామాబాద్ జిల్లాలతో ఎంతో అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నెహ్రూ నిజామాబాద్ జిల్లాకు వచ్చారని, నిజామాబాద్ జిల్లాలో రైతులకు లక్షల ఎకరాలకు నీరురావడానికి శ్రీరామ్‌సాగర్ కారణమని అన్నారు. నెహ్రూ ఆలోచన విధానాలను ఆశయాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు అందిపుచ్చుకొని ముందుకు వెళ్లాలని, ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతిరెడ్డి రాజారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్ ఖైసర్ ,స్వామి గౌడ్, ప్రమోద్, ముష్య పటేల్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మెండోరా : శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని 1963లో భారత ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ శ్రీరాంసాగర్ ప్రాజెక్టును ప్రారంభించారని కొనియాడుతూ ఆయన జ్ఞాపకాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ జి.శ్రీనివాస్, ఈఈ చక్రపాణి, డిఈఈ గణేష్, సూపరింటెండెంట్ గైని గంగారాం, ఎస్ టిపిఎ రమణ, ఎస్ఎ రవీందర్ పాల్గొన్నారు.

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

- ఐద్వా డిమాండ్

నవతెలంగాణ-ఆర్మూర్



నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

మైనర్ బాలికలపై లైంగికదాడులకు పాల్పడుతున్న నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత అన్నారు. సోమవారం పట్టణంలోని రాజారాంనగర్‌కు చెందిన మైనర్ బాలిక లైంగికదాడికి గురైంది. ఈ విషయం తెలుసుకొని సోమవారం ఇంటికి వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి, మండల కార్యదర్శి హసీనాతో కలిసి బాలిక ఇంటికి వెళ్లి పరిస్థితి తెలుసుకున్నారు. ఈ మధ్యకాలంలో ఆర్మూర్ మండల కేంద్రంలో మైనర్ బాలికలపై లైంగికదాడులు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. షీ టీంలు లేకపోవడంతో ఇష్టానుసారంగా మాస్ ఏరియాలో మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. లాంటి ప్రాంతాలలో 24 గంటలు ప్రభుత్వం షీ టీమ్‌లతో నిఘా పెంచాలని ఆదేశించారు. కూలీ నాలీ చేసుకుని బతికే ఏరియాలలో ఇవి విపరీతంగా పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడానికి పోలీస్ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిందితులకు కఠినమైన శిక్షలు పడకపోవడం ప్రధానమైన కారణమన్నారు. ఎవరైతే మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారో వారిని కఠినంగా శిక్షించడంలో పోలీసులు విఫలమయ్యారని తెలిపారు. అందుకే నిజామాబాద్ జిల్లాలో విచ్చలవిడిగా రేపిస్టులు పెరుగుతున్నారని చెప్పారు. వీటిని అరికట్టే విషయంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే మహిళా ఉద్యమాలు తప్పవని ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత హెచ్చరించారు.

'పర్యావరణ పరిరక్షణ'పై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జూన్ 5న "ప్రపంచ పర్యావరణ దినోత్సవం" సందర్భంగా ఈనెల 29న ఉదయం 10:30 గంటలకు జిల్లా బాలభవన్‌లో పర్యావరణ పరిరక్షణ అంశంపై పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖణ పోటీలు నిర్వహించనున్నట్టు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయ పర్యావరణ ఇంజనీర్ లక్ష్మణ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోటీలలో గెలిచిన విజేతలకు జూన్ 5న 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' సందర్భంగా న్యూ అంబేద్కర్ భవన్, ఖలీల్‌వాడీలో "ప్రపంచ పర్యావరణ దినోత్సవం" కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఈ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని వివరించారు.

పీఎఫ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- బీఎల్‌టీయూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న బీఎల్‌టీయూ నాయకులు

నిజామాబాద్ జిల్లాలోని మున్సిపల్, బీడీ, ఇతర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు రిటైర్మెంట్ అయినవారికి, మృతిచెందిన వారికి రావాల్సిన పిఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు కోట్లాది రూపాయలు కార్మికుల బ్యాంక్ ఖాతాలకు జమచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ ఆరోపించారు. సోమవారం పీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పీఎఫ్ కార్యాలయం అధికారులు సంవత్సరాల తరబడి కార్మికులను తమ చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేధింపులు తట్టుకోలేని కార్మికులు పిఎఫ్ కార్యాలయానికి కొంత మంది సిబ్బందితో 20, 30 శాతం పర్సంటేజ్ ఇస్తే పనులు చేయిస్తున్నామని తెలిపారు. వారంరోజుల్లో పిఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమచేయకపోతే పిఎఫ్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఎల్లారెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ కార్మికులకు గత రెండు సంవత్సరాలుగా పిఎఫ్, ఇన్సూరెన్స్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయడం లేదని వెంటనే జమచేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, బిఎల్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ బీఎల్టీయూ నాయకులు నవీన్, ఎం.ఎల్లయ్య, నగర నాయకులు కె.సహాదేవ్, ఎల్లారెడ్డి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బీఎల్టీయూ కార్యదర్శి మల్లేష్, ఆర్మూర్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాజేశ్వర్‌లతోపాటు నిజామాబాద్, ఆర్మూర్, ఎల్లారెడ్డి మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీడీ కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలని బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు వై.ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వై.ఓమయ్య మాట్లాడుతూ.. బీడీ కార్మికుల ప్యాకర్ల నెలసరి ఉద్యోగుల గత వేతన ఒప్పందం ఏప్రిల్ 30తో ముగిసిందని, నూతన వేతనాలు మే 1 నుంచి అమల్లోకి రావాల్సినా.. యాజమాన్యం పెంచకపోవడంతో మూడు నెలలుగా బీడీ కార్మిక సంఘాలు ఫెడరేషన్ల ఆధ్వర్యంలో పోరాటం చేసిన ఫలితంగా మే 25న హైదరాబాద్‌లో బీడీ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ బీడీ కార్మిక సంఘాలు ఫెడరేషన్లతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిగి బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు నాలుగు రూ.25 పైసలు, ప్యాకర్లకు రూ.3650, నెలసరి ఉద్యోగులకు (బట్టి వాల) రూ.1700, ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై పెంచుకున్నట్టు తెలిపారు. పోరాడి వేతనాలు పెంచుకున్న కార్మికులకు ఏఐటియుసి తరపున శుభాకాంక్షలు, ఉద్యమాభివందనాలు తెలియజేశారు. పెంచిన వేతనం మే ఒకటి నుంచి అమలు చేయాలని లేనియెడల ఆందోళన చేస్తామని తెలిపారు.

ఎన్టీఆర్ చేసిన అభివృద్ధి మరువలేనిది

- టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



రక్తదానం చేస్తున్న నాయకులు

నందమూరి తారకరామారావు చేసిన అభివృద్ధి ఏనాటికీ మరువలేనిదని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదగౌడ్ అన్నారు. సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో నందమూరి తారకరామారావు 101వ జయంతి సందర్భంగా రెడ్‌క్రాస్ సహకారంతో మహా రక్తదాన శిబిరాన్ని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పదుల సంఖ్యలో పార్టీ నాయకులు అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదగౌడ్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన వాళ్ళం అవుతామని అన్నారు. నందమూరి తారకరామారావు చేసిన అభివృద్ధి ఏనాటికీ మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్, అర్బన్ అధ్యక్షులు అంబిక సత్యనారాయణ, పార్లమెంట్ కమిటీ నాయకులు జ్యోతి నారాయణ, తెలుగు యువత అధ్యక్షులు శ్రీనివాస్‌బాబు, బీసీ సెల్ అధ్యక్షులు దంతాల ఆనంద్, బిజినెస్ సెల్ అధ్యక్షులు బొబ్బ నరసింహారావు, కొయేడి నర్సింలు, శంకర్ ముదిరాజ్, నవాతే నర్సయ్య, లవంగ రాజు, జనార్ధన్‌చారి, గోవర్ధన్ గౌడ్, కోటేశ్వరరావు, రవికుమార్ పాటిల్, హరీష్ చౌదరి, ధనరాజ్, రాజేశ్వర్, సత్యనారాయణ, షాదుల్లా, రాములు, బాలాజీగౌడ్, లక్ష్మి యాదవ్, స్వామి, జేమ్స్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీబీఏఎస్ అభ్యర్థులు జూన్ 12న హాజరుకావాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థుల కోసం బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బీఏఎస్) స్కీం అమలుకై చేసే పద్ధతిని, జిల్లాలో ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో అడ్మిషన్ ప్రాసెస్ కోసం జూన్ 12న ఉదయం 11 గంటలకు డ్రా పద్ధతిలో తీయనున్నట్టు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బీఏఎస్ స్కీమ్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్టీల అడ్మిషన్ల ఎంపిక కోసం లాట్ డ్రా పద్ధతి జూన్ 12న నిర్వహించడం నిర్ణయించారు అని అన్నారు. నిజామాబాద్‌లోని బీఏఎస్ కోసం అడ్మిషన్లకు సంబంధించి లాట్‌ల డ్రాల్‌ను చేపట్టేందుకు ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని సూచించారు.

నవతెలంగాణ
కామారెడ్డి
3
మంగళవారం | మే 28, 2024 | www.navatelangana.com

దోస్త్ ఆన్‌లైన్ ప్రవేశాల సర్టిఫికెట్ పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశానికి 2024-25 సంవత్సరానికి ప్రత్యేక కేటగిరి విభాగంలో తెలంగాణ యూనివర్సిటీతోపాటు అనుబంధ కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన అకాడమిక్ ఆడిట్ సెల్‌ను సోమవారం నిర్వహించారు. ఈ ప్రత్యేక కేటగిరీలో ఎంపికైన విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, మే 28న పిహెచ్‌సి (దివ్యాంగులకు) సర్టిఫికెట్స్ పరిశీలన జరుపబడుతుందని, 29న ఎన్‌సిసి సర్టిఫికెట్స్ పరిశీలన జరుగుతాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దోస్త్ సమన్వయకర్త డాక్టర్ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సందేహాలకు 9848904793/8374406322 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

కస్తూర్బాగాంధీ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

- స్పెషల్ ఆఫీసర్ సుశీల

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కస్తూర్బా పాఠశాల, కళాశాల ప్రత్యేక అధికారిని సుశీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఇంగ్లీష్ మీడియంలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 2024-25 కొరకు ఆంగ్ల మాధ్యమంలో ఎంపీసీ గ్రూప్‌లో(40), బైపిసి (40) సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రవేశాల కొరకు 10వ తరగతి పాస్ అయిన బాలికలు అర్హులని ఆమె తెలిపారు. ఉచిత భోజనంతో పాటు ఉచిత పుస్తకాలు, ఏకరూప దుస్తులు కూడా అందజేస్తామని ఈ అవకాశాన్ని ఆసక్తి కలిగిన బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివరాల కొరకు కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాలలో సంప్రదించాలని కస్తూర్బా గాంధీ పాఠశాల కళాశాల ప్రత్యేక అధికారిని సుశీల కోరారు.

నత్త నడకన బ్రిడ్జి పనులు

- అసంపూర్తిగా ఒకటి.. ప్రారంభం కాని మరోటి..
- బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోతే ప్రజలకు ఇక్కట్లే
- అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణాలను పూర్తి చేయాలి

నవతెలంగాణ-రామారెడ్డి

బ్రిడ్జి పనుల నిర్మాణాలు నత్త నడకన కొనసాగుతున్నాయి. అసంపూర్తిలో ఒకటి.. ప్రారంభం కానిది మరోటి. ప్రజా రవాణా కోసం రోడ్లతోపాటు బ్రిడ్జిలను ప్రభుత్వం నిర్మిస్తూ ఉంటుంది. మండల పరిధిలో గంగమ్మ వాగు బ్రిడ్జి రక్షణ లేక గతంలో రోడ్డు ప్రమాదంలో చాలామంది మరణించారు. ఎంతోమంది క్షతగాత్రులు అయ్యారు. ఎట్టకేలకు ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రామారెడ్డి పరిధిలోని గంగమ్మ వాగుకు, అడ్లూర్ పరిధిలోని వాగుకు బ్రిడ్జి నిర్మాణం కోసం రూ3 కోట్లు, రూ.3.43 కోట్లు మంజూరు చేశారు. గంగమ్మ వాగుపై సదరు కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి 8 నెలలు పూర్తవుతున్నా, ఇప్పటివరకు పిల్లర్లను నిర్మించి, స్లాపు నిర్మాణం పూర్తి కాకపోవడం, మరోవైపు అడ్లూర్ వాగు బ్రిడ్జి


నిలిచిపోయిన గంగమ్మ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు

నిర్మాణం ప్రారంభించకపోయారు. 15 నుంచి 20 రోజులో వర్షాకాలం ప్రారంభం కానున్నందున, వర్షాలు ఎక్కువగా కురిస్తే ప్రజా రవాణా ఇబ్బందిగా మారే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కామారెడ్డి జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం రామారెడ్డి, మాచారెడ్డి మండల ప్రజలతోపాటు నిజామాబాద్ జిల్లా సిరికొండ, భీంగల్, మండల ప్రజలు ఈ రహదారిపై నుంచే వెళ్తుంటారు. ఒకవేళ ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోతే, కన్నాపూర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో మూడు దారులు మూసుకుపోయి ప్రజా రవాణా ఇబ్బందిగా మారే ప్రమాదం ఉంటుంది. వెంటనే స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెండు నెలల్లో పూర్తి చేస్తాం

రామారెడ్డి గంగమ్మ వాగు బ్రిడ్జి రెండు నెలల్లో పూర్తి చేస్తాము. అడ్లూర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. నాలుగు నెలల్లో బ్రిడ్జి పనులు పూర్తి చేసి ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తాం.

– శ్రీనివాస్, ఆర్అండ్‌బీ డిఈ

పనులు వెంటనే పూర్తి చేయించాలి



ప్రజల సౌకర్యార్థం బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే లైన్ గంపగోవర్ధన్, జాజాల సురేందర్ సహకారంతో, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గర్గుల్, అడ్లూర్, రామారెడ్డి వాగులకు టెండర్లు పూర్తి చేసి, నిధులు మంజూరు చేసిన, ప్రజల సౌకర్యార్థం బ్రిడ్జి నిర్మాణాలను పూర్తి చేయించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితనానికి దర్పనం. పనులు వెంటనే పూర్తి చేయించి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేదంటే ప్రజల పక్షాన ప్రభుత్వంపై ఉద్యమం తప్పదు.

– నారెడ్డి దశరథ్ రెడ్డి, ఎంపీపీ రామారెడ్డి

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి



వర్షాకాలం దగ్గర పడుతున్న, ప్రభుత్వం గంగమ్మ వాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా, పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ప్రజల సౌకర్యార్థం అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని మండల ప్రజల తరపున కోరుతున్నా.

– వడ్ల బ్రహ్మచారి, మద్దికుంట

సుంకే విక్రమ్‌కు జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న సుంకే విక్రమ్

నవతెలంగాణ-ముప్కాల్

'బహుజన సాహిత్య అకాడమీ' (బీఎస్ఏ) వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారికి జాతీయ స్థాయిలో అవార్డులు ప్రకటిస్తున్నారు. ఈ సందర్భంలో 2024-25 సంవత్సరంకు గాను నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం నాగాంపేట్ గ్రామానికి చెందిన సుంకే విక్రమ్‌కు మహాత్మాజ్యోతి భాపూలే జాతీయ అవార్డ్‌కు ఎంపికైనట్లు జాతీయ అధ్యక్షులు రాధాకృష్ణ తెలిపారు. సామాజిక సేవా, విద్యారంగంలో బహుజన నాయకుడిగా మహాత్మ ఫౌండేషన్ పేరిట విశేష కృషి చేసినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ అవార్డును జూన్ 10న మహారాష్ట్ర రాష్ట్రంలోని పూణే పట్టణ కేంద్రంలో అందుకోనున్నట్లు తెలియజేశారు. సుంకే విక్రమ్ అవార్డ్‌కు ఎంపిక కావడం పట్ల పలువురు ప్రముఖులు, మండల వాసులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల, సాటాపూర్, దూపల్లి, కందకుర్తి గ్రామాలలో నకిలీ విత్తనాలపై స్థానిక రైతులకు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ గుర్తింపు పొందిన ట్రేడర్లలో మాత్రమే కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా విత్తనాలకు రసీదును తీసుకోవాలని వారు సూచించారు. పంటచేతికి వచ్చే వరకు రసీదును జాగ్రత్తగా తమ దగ్గర ఉంచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలర్ల వద్ద కొనుగోలు చేయాలన్నారు. డీలర్లు తక్కువ ధర విత్తనాలను ఎక్కువ ధరలకు అమ్మినట్లు తమ దృష్టికి వస్తే ఖచ్చితంగా మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అజయ్, కవిత, గోపికృష్ణ, కృష్ణవేణి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్ సోమవారం తెలిపారు. 68 మందికి చికిత్సలు నిర్వహించగా 8 మందికి మోతి బిందు ఉన్నట్లు నిర్ధారించి వారిని బాన్సువాడ కంటి ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా 12 మందికి దృష్టిలోపం ఉన్నందున వారికి కంటి అద్దాలను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కంటిలో తెల్ల పువ్వు ఉన్న ఇద్దరినీ హైదరాబాద్ కంటి ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్‌రావు, ఎంపిహెచ్ ఈఓ రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాయకుడు వేధిస్తుండు

- పశువైద్య డాక్టర్ బండి వార్ విజయ్

నవతెలంగాణ-మద్నూర్

మండలానికి చెందిన ఒక నాయకుడు తనకు డబ్బులు ఇవ్వాలని వేధిస్తూ డబ్బులు ఇవ్వనందుకు తనపై తప్పుడు ఆరోపణలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడని దాంతో తాను మానసికంగా కుమిలిపోతున్నానని పశువైద్య డాక్టర్ బండివార్ విజయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను ఎన్నికల్లో ప్రచారం చేసినట్లు తప్పుడు ఫోటోలు పెట్టి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని ఆరోపించారు. తాను మద్నూర్ మండల కేంద్ర గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా ఉన్న సమయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతారావు మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఫోటోలు పెట్టి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు చేయడం మానసికంగా కుమిలిపోతున్నానని పేర్కొన్నారు. తాను విధులు సక్రమంగా నిర్వర్తించడం సామాజిక సేవలో పాల్గొనడం ఆ నాయకునికి ఇష్టంలేక తనకు డబ్బులు అడిగే ప్రయత్నం చేయగా తాను ఇవ్వనందుకే తప్పుడు ఫోటోలతో జిల్లా కలెక్టర్‌కు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఒక మండల నాయకులుగా ఉండి తప్పుడు ఫిర్యాదులు చేయడం తనపై కక్ష కట్టాడని ఆరోపించారు. ఆ నాయకుని వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నాయని తనకు ఏదైనా జరిగితే ఆ నాయకుడే బాధ్యత వహించవలసి ఉంటుందని తెలిపారు. ఇలాంటి తప్పుడు సమాచారంతో ఫిర్యాదు చేసిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని జిల్లా కలెక్టర్ తగిన న్యాయం చేకూర్చాలని విన్నవించారు.

ఐలాపూర్ కుస్తీ పోటీలు


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మహిళా మల్లయోధులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఐలాపూర్ గ్రామంలో సోమవారం దుర్గ ఉత్సవాలు బాగా ఆలయం సమీపంలో ఆ గ్రామ కమిటీ ఆలయ కమిటీ నిర్వాహకులు కుస్తీ పోటీలు నిర్వహించారు. దుర్గ ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం మధ్యాహ్నం నుంచి టెంకాయ కుస్తీ నుండి మొదలుకొని వెండి కడియం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ కుస్తీ పోటీలో మహిళా కుస్తీ పైల్వాన్లు నారాయణపేట జిల్లా గీత రజిత మహబూబ్‌నగర్ జిల్లా మీనా సంధ్య కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. మహిళా కుస్తీ పోటీల్లో పైల్వాన్లు మగవారితో సమానంగా కుస్తీ పట్టడంతో కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. మహిళ కుస్తీ మల్లయోధులను ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు వారిని అభినందించారు. అనంతరం వారికి బహుమతులు అందజేశారు. ఈ కుస్తీ పోటీల్లో ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో, ఎంపీఓ


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీఓ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట తాండ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్, ఎంపీఓ గౌస్ ఉద్దీన్ సోమవారం పరిశీలించారు. జూన్ లోపు మొక్కలు ఎండిపోకుండా కాపాడాలని, ఎండిపోయిన స్థలాలలో తిరిగి మొక్కలు నాటాలని కార్యదర్శి వెంకటరమణను ఆదేశించారు. అనంతరం ప్రకృతివనాన్ని వారు పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటరమణ ఉన్నారు.

బీడీ కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

నవతెలంగాణ-దోమకొండ

తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ నాయకులు బీడీ కార్మికుల ఆధ్వర్యంలో దోమకొండ మండల కేంద్రంలోని దేశాయి బీడీ కంపెనీ సెంటర్ వద్ద బీడీ కంపెనీ యాజమాన్యం బీడీ కార్మికులకు వేతనాలు పెంచడంతో హర్షం వ్యక్తం చేస్తు సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీఎల్‌టీయు కార్మికుల సంఘం నాయకులు మాట్లాడుతూ


సంబురాల్లో పాల్గొన్న బిఎల్‌టియు నాయకులు

తెలంగాణ రాష్ట్రములోని బీడీ పరిశ్రమలో పనిచేయు దాదాపు 8 లక్షల మంది బీడీ కార్మికులకు, బీడీ ప్యాకర్లకు, బట్టి, చటన్, నెలసరి ఉద్యోగులు, తదితరులకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి, మూల వేతనాలు పెంచాలని నిబంధనల మేరకు నూతన ఒప్పందం బీడీ యాజమాన్యం కార్మిక సంఘాలతో చేసుకోవాల్సి ఉంది. బీడీ యాజమాన్యం దిగివచ్చి, తేదీ25-5-2024న హైదరాబాద్‌లో చర్చలు జరిపి, బీడీ కార్మికుల డిమాండ్లను ఒప్పుకున్నారు. బీడీ కార్మికులకు వేతనాలు పెంపు కోసం తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, బిఎల్ టీయూ, కార్మికులు పోరాడి సాధించిన సందర్భంగా సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు సంబరాలు నిర్వహించాలని ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ ఆధ్వర్యంలో దోమకొండ, మండల కేంద్రంలో దేశాయి, బీడీ సెంటర్‌లో బీడీ ప్యాకర్లు, బట్టి, చటన్, తదితరులు, అనందంతో స్వీట్లు పంచుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యంఅంజేయులు, జిల్లా నాయకులు, కుమ్మరి రవి, దేశాయి ప్యాకర్లు, చంద్ర మౌళి, శేఖర్, శంకర్, సిద్ధిరాములు తదితరులు ఉన్నారు.

వాటర్ ట్యాంక్‌లోకి దూకి యువకుడు ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండల పరిధిలోని కళ్యాణి గ్రామానికి చెందిన బండారి కాశీరాం అనే యువకుడు ఆదివారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని వైశ్య భవన్ ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి ట్యాంక్‌లోకి దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ట్యాంకర్ ఎక్కుతుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా హుటాహుటిన పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో వచ్చి పెద్ద తాడు సహాయంతో వాటర్ ట్యాంక్‌లోకి దిగి అతన్ని కాపాడారు. అనంతరం ఆయనకు కౌన్సెలింగ్ ఇచ్చి అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాగుడుకు బానిసై కుటుంబ కలహాలతోనే అతను ఆత్మహత్య ప్రయత్నం చేశారని, అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది పోలీసులు తెలిపారు.


హత్యాయత్నం చేసిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి

- మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ

నవతెలంగాణ-ఆర్మూర్

రైతులు విత్తనాలను లైసెన్స్ కలిగిన విత్తన దుకాణాల నుంచే కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ తెలిపారు. మండలంలోని ఫతేపూర్, గోవింద్ పేట్, పిప్రి, ఇస్సపల్లి, దేగాం, రాంపూర్ గ్రామాలలో సోమవారం వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రైతులకు వానాకాలంలో విత్తన కొనుగోలులో తీసుకునే జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తన సంచి, పంట చివరి వరకు భద్రపరచుకోవాల్సిందిగా గడువు ముగిసిన విత్తనాలను కొనుగోలు చేయవద్దని, లేబుల్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాల్సిందిగా రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు నరేష్, శరత్చంద్ర, వసంతలక్ష్మి, శివాని, సవిత, వసుధం రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ మండలంలోని పలు గ్రామాలలో..

మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వానాకాలం సంబంధించి విత్తన కొనుగోళ్ల పైన అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మండలంలోని రామన్నపేట్, కుకునూర్, అమీనాపూర్, పోచంపల్లి గ్రామాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు విత్తనాలు కొనే ముందు గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్ పైన సీడ్‌కు సంబంధించి పరీక్ష చేసిన తేదీ, విత్తనం కాల పరిమితి, విత్తనాన్ని ప్యాకేసిన తేదీ ఉంటాయని పేర్కొన్నారు. విత్తనానికి సంబంధించిన మొలకెత్తు శాతం భీమశాతం లేబల్‌పైన ఉంటాయని, రైతులు వాటిని పరిశీలించి విత్తనాలు కొనుక్కోవాలని తెలిపారు. విత్తనాలు కొన్న డీలర్ దగ్గర నుంచి బిల్లు తప్పనిసరిగా రైతులు తీసుకొని జాగ్రత్తగా పరుచుకోవాలన్నారు.

నకిలీ విత్తనాలు ఎవరైనా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నర్సయ్య, ఈవోలు ప్రశాంత్, షబ్బీర్ రైతులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో అపారనష్టం

- రోడ్డున పడ్డ కుటుంబాలు
- సందర్శించిన జిల్లా అధికారులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ డివిజన్ పరిధిలోని బాన్సువాడ, బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో నివాస ఇండ్లు, చెట్లు, కరెంటు స్తంభాలు విరిగి రోడ్డున పడ్డాయి. బాన్సువాడ మండలం బోర్లం, బోర్లం క్యాంప్‌లో గత రాత్రి గాలివాన బీభత్సానికి గురైన బాధితులను అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ పరామర్శించి భరోసా కల్పించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు సోమవారం అదనపు కలెక్టర్ బోర్లం, బోర్లం క్యాంప్‌లో దెబ్బతిన్న రేకుల ఇండ్లు, పెంకుటిల్లులు, కల్కి చెరువు ప్రాంతంలో నేలకొరిగిన, ధ్వంసమైన విద్యుత్ స్థంబాలు సందర్శించారు. ఈదురుగాలులకు 60 ఇండ్ల మేర నష్టం వాటిల్లగా, 15 ఇండ్ల పై కప్పు రేకులు లేచిపోయి నిరాశ్రయులై పక్క ఇండ్లలో ఆశ్రయం పొందిన బాధితులను పరామర్శించి ప్రభుత్వానికి నివేదిక అందించి అన్ని విధాలా ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్‌లు రెండు రోజులలోగా క్షేత్ర స్థాయిలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందజేయవలసినదిగా ఆదేశించారు. తక్షణ సాయంగా బాధితులకు ఉచితంగా 10 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, మంచినూనె, కారం, చింతపండు, ఉప్పు వంటివి అందించవలసినదిగా సూచించారు. అనంతరం బాన్సువాడ, పిట్లం, నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాలలోని పలు రైస్ మిల్లులను సందర్శించారు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యమును సకాలంలో ప్రభుత్వానికి అందించాలని ఆయన సూచించారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో కలిసి అన్ లోడింగ్ పాయింట్‌లను ఎక్కువగా పెట్టుకొని త్వరగా ధాన్యం దించుకోవాలని మిల్లర్లకు సూచించారు. ముందుగా బాన్సువాడలో ఉమామహేశ్వర ఇండస్ట్రీస్, పిట్లంలోని వైష్ణవి ఆగ్రో ఇండస్ట్రీస్, బిలాల్ బిన్నీ రైస్‌మిల్, బిచ్కుందలోని శివ బాలాజీ ఆగ్రో ఇండస్ట్రీస్, నాసురుల్లాబాద్ లోని పారిజాత ఇండస్ట్రీస్, శ్రీ లక్ష్మి శ్రీనివాస ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను సందర్శించారు. జిల్లాలో ఇప్పటి వరకు 350 కొనుగోలు కేంద్రాలకు గాను 310 కేంద్రాలలో కొనుగోళ్లు పూర్తిచేశామని, మిగిలిన 40 కేంద్రాలలో ధాన్యం 2,3 రోజులల్లో సేకరించి ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. ఇప్పటి వరకు 52,413 మంది రైతుల నుండి 670 కోట్ల విలువల 3,03,852 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు 603 కోట్లు చెల్లించామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్ రాథోడ్, తహసీల్దార్ వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు,


ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్థంభం

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
మంగళవారం మే 28, 2024 www.navatelangana.com

పల్లె ప్రకృతి వనాన్ని తనిఖీ

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

మండలంలోని చక్రధర్‌నగర్ తండాను ఎంపీడీవో మధురిమ ప్రకృతివనాన్ని సోమవారం తనిఖీ చేశారు. మొక్కలను ఏ విధంగా పెంచాలి మొక్కలకు నీరు పట్టే విధానం సూచించారు. సరిగా నీళ్ల పట్టేలా పాగులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పల్లె ప్రగతికి సంబంధించిన ఆస్తులు, డంపింగ్ యార్డ్, శ్మశానవాటిక, నర్సరీలను పరిశీలించారు.



ప్రకృతి వనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన బంగ్లా దేవేందర్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని ముచ్కూర్ గ్రామ పిఏసిఎస్ నూతన సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైనందున బంగ్లా దేవేందర్‌ను సన్మానించి ప్రశంసలు తెలియజేశారు. బంగ్లా దేవేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైన తరుణంలో శుభాకాంక్షలు తెలియజేసిన సొసైటీ సభ్యులు భూరెడ్డి గంగారెడ్డి, బురెడ్డి రాజన్న, ఒడ్యాల లక్ష్మణ్, తెడ్డు లావణ్య, కైరి లక్ష్మి, ఇదాబు శ్రీనివాస్, గాండ్ల బాలయ్య, వేంపల్లి లక్ష్మీ నర్సాగౌడ్, బొమ్మన సాయన్న తదితరులు పాల్గొన్నారు.


నూతన సొసైటీ చైర్మన్‌గా ఎన్నిక

నగరంలో విత్తన దుకాణాలు తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని విత్తన డీలర్ షాపులను నిజామాబాద్ అర్బన్ సౌత్, నార్త్ మండలంలో, మండల వ్యవసాయాధికారి సౌమ్య సోమవారం తనిఖీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నగరంలోని డీలర్ షాపులలో ప్రత్యేక తనిఖీలను నిర్వహిస్తున్నారు. తనిఖీల నిర్వహిస్తూ డీలర్లకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ డీలర్ దగ్గర ఏ రైతుకు విత్తనాలను అమ్ముతున్నారు?, ఏ రకపు విత్తనాలను అమ్ముతున్నారు?, ఏ కంపెనీకి సంబంధించిన విత్తనాలను అమ్ముతున్నారు?, ఆ కంపెనీ లాట్ నెంబర్ అన్ని అంశాలను ఇన్వైస్‌లో పొందపరచి బిల్లును రైతులకు అందించాలని సూచించారు. అదేవిధంగా రైతులకు అమ్మే విత్తనాల ఇన్వాయిస్ వివరాలను ప్రత్యేకంగా డీలర్‌షాప్‌ల వద్ద ఉండే రిజిస్టర్లు పొందపరచాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ శ్వేత పాల్గొన్నారు.

2043 గొర్రెలకు చిటుకు రోగం నివారణ టీకాలు


గొర్రెలకు టీకాలు అందజేస్తున్న పశువైద్య అధికారి

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో పశువైద్య, పశుసంవర్ధక ఆధ్వర్యంలో 2043 గొర్రెలకు చిటుకు రోగం టీకాలు సోమవారం వేశారు. ఈ సందర్భంగా డా.కిరణ్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. మండలంలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన పశువులకు వచ్చే గొంతువాపు, జబ్బువాపు రోగాలకు సంబంధించిన మందులు మండలంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గొర్రెలకు సంబంధించి చిటుకు రోగం సంబంధించిన టీకాలు అందుబాటులో ఉన్నాయని, గొర్రెలకు వీటిని వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా.ఉమమా సహీర్, వీఎల్‌ఓటి వివిత, విఓ అహ్మద్ పాషా, సుదీర్, జైల్‌సింగ్, శ్రీను, గంగాధర్, పుష్ప, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

మహిళా శక్తి టైలరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

- డీపీఎం నీలీమా


మాట్లాడుతున్న డీపీఎం నీలీమా

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మహిళా శక్తి టైలరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సెర్ప్ డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ నీలీమా అన్నారు. సోమవారం మండలంలోని ఐకెపి కార్యాలయంలో ఏకరూప దుస్తుల బట్ట ఎంత వచ్చింది రావాల్సినంత వచ్చిందా లేదా అని ఏపిఎం రవీందర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పాఠశాలలో చదివే విద్యార్థులు ఎంతమంది ఉన్నారు?, వారికి సరిపడా బట్ట మండలానికి చేరుకుందా లేదా అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళ శక్తి టైలరింగ్ సెంటర్లోని ఏర్పాటు చేసి, ఏర్పాటు చేసిన టైలరింగ్ సెంటర్లకు కొలతల ప్రకారం కటింగ్ చేసిన బట్టలు వెంటనే పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపియం రవీందర్ రెడ్డి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మండల సమైక్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

తానాకుర్ది గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా కూచన్‌పల్లి నాగార్జున్

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తానకుర్ది గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కూచన్‌పల్లి నాగార్జునరెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధే తన ప్రధాన ధ్యేయమని, గ్రామంలోని అందరినీ కలుపుకొని గ్రామాభివృద్ధికి నిరంతరం తోడ్పడుతానని ఆయన తెలిపారు.

29న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-బాల్కొండ

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశం ఎంపీపీ యమగంటి లావణ్య అధ్యక్షతన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.

లైసెన్స్ డీలర్ల వద్దే
విత్తనాలు కొనుగోలు చేయాలి

- సూచించిన మండల వ్యవసాయాధికారులు
- విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-విలేకరుల బృందం

మోర్తాడ్ : రైతులు వార్షకాలం సీజన్లో నాటే విత్తనాలను లైసెన్స్ డీలర్ల వద్ద విత్తనాలను కొనుగోలు చేయాలని ఏవో లావణ్య, ఏఈఓలు రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని పాలెం, తిమ్మాపూర్, దొనకల్, వడ్డీయార్డ్ గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు తప్పనిసరిగా రసీదుతో విత్తనాలను కొనుగోలు చేయాలని, రైతులు కొనుగోలు చేసిన విత్తన బ్యాగులను పంట పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారిని ఏవో లావణ్య మండల కేంద్రంలోని సీడ్స్ వ్యాపారస్తుల షాపులను తనిఖీ చేస్తూ ప్రభుత్వం అనుమతి పొందిన విత్తనాలు మాత్రమే విక్రయాలు జరపాలని అనుమతి లేకుండా విత్తనాలు కొనుగోలు చేస్తే సంబంధిత షాప్ యజమానిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

విత్తనాల కొనుగోలు పై అవగాహన కార్యక్రమం..

కమ్మర్‌పల్లి : మండలంలోని కోనాపూర్, నాగపూర్, బషీరాబాద్, హసకొత్తూర్ గ్రామాల్లో సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్సు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. అదేవిధంగా తప్పనిసరిగా రసీదు తీసుకుని పంట కాలం అయిపోయే వరకూ రసీదు, విత్తన సంచి జాగ్రత్తగా ఉంచాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఎస్.సాయిరాం, రాజు, జి.రమేష్, జె.కావ్య, ఎం.పద్మ, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.


ముప్కాల్ : సమావేశంలో మాట్లాడుతున్న అధికారి


కమ్మర్‌పల్లిలో..

మాక్లూర్ : రైతులు పంటలకు అవసరమైన విత్తనాలు కొనుగోలు విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి పద్మ సూచించారు. సోమవారం మండలంలోని బోర్గం (కే), బొంకన్‌పల్లి గ్రామంలో విత్తనాలు కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించిందని, లూజుగా ఉన్న సంచులలో విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని, విత్తన ప్యాకెట్ బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని అన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. ప్యాక్ చేసిన, లేబుల్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, గడువు ముగిసిన విత్తనాలను కొనుగోలు చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి రంజిత్, రైతులు పాల్గొన్నారు.

ముప్కాల్ : రానున్న వానాకాలం 2024 సీజన్ దృష్ట్యా ముప్కాల్ మండలం రెంజర్ల, వేంపల్లి గ్రామాలల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ముందస్తుగా విత్తనాలు కొనుగోలుపైన అవగహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు మండల వ్యవసాయ అధికారి ఏ.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా లైసెన్స్ లేని అనధికారిక విత్తనాలతో నష్టాలపై రైతులకు వివరించారు. రైతులు తప్పనిసరిగా లైసెన్స్ గల డీలర్స్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా ఆ విత్తనం సంబందించిన వివరాలు రసీదులో చూసి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, రెంజర్ల, వేంపల్లి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.


మోర్తాడ్ : అవగాహన కల్పిస్తున్న అధికారులు


మాక్లూర్‌లో..

అద్భుతాలు ఆవిష్కరించిన జాదూ రంగనాథ్ మ్యాజిక్ షో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ బాలభవన్‌లో వేసవి శిక్షణా తరగతులలో భాగంగా జిల్లాలో ప్రముఖ కళాకారుడు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వేనోళ్ల పొగిడి సత్కారాలు అందుకున్న జాదూ యుగంధర్ రంగనాథ్ సోమవారం బాల్‌భవన్‌లో ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన పిల్లలందరినీ అబ్బురపరిచింది. కార్యక్రమ ప్రారంభం నుంచి ప్రదర్శన ముగిసే వరకు ప్రాంగణమంతా పిల్లల చప్పట్లు, అరుపులు కేకలతో మారుమోగింది. చిన్నారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. బాలభవన్ అద్భుతాల ఆవిష్కరణలకు వేదికగా మారింది. ఖాళీడబ్బాలో నుంచి మ్యాజిక్‌తో అనేక రకాల వస్తువులను తీసి చూయించారు. చివరకు జాతీయ జెండాను తీసి పిల్లలందరినీ ఆశ్చర్యచకితులను చేశారు. ఈ ప్రదర్శన పిల్లల్ని బాగా ఆకర్షించింది. అనంతరం మ్యాజిక్ షో ప్రదర్శించిన వేదాంతం రంగనాథ్ మాట్లాడుతూ.. ఇంద్రజాలం వల్ల పిల్లల్లో ఉన్న భయాలు, అపోహలు తొలగిపోతాయన్నారు. చిన్నప్పటి నుంచే దేనినైనా "చేసి చూడాలి, చూసి నమ్మలనే నేపుణ్యం' అలవడుతుందన్నారు. తర్వాత బాలభవన్ సూపరింటెండెంట్ విఠల్ ప్రభాకర్ మాట్లాడుతూ.. వేసవి శిక్షణలో పిల్లలకు బాల్‌భవన్ నూతన ఆవిష్కరణలతో పిల్లల్లో నిబిడీకృతమైన నైపుణ్యాలకు సృజనాత్మకతతో కూడిన ఆలోచనలకు పదును పెడుతుందన్నారు. మంచి ప్రదర్శన ఇచ్చిన జాదూ రంగనాథ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమాబాల, వెంకటలక్ష్మి, పుష్పలత, కల్పన, గణేష్,శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


మ్యాజిక్ చేస్తున్న రంగనాథ్

ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన ఎస్.జె.డబ్ల్యూ.హెచ్.ఆర్.సి ప్రతినిధులు


వివరాలు అడిగి తెలుసుకుంటున్న సభ్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఎస్.జె.డబ్ల్యూ.హెచ్.ఆర్.సి జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ ఆదేశానుసారం ఓ పత్రికలో వచ్చిన ఆరోగ్య శ్రీ లో రోగులకు కుళ్ళిన గుడ్లు, పురుగుల అన్నం అనే కథనం మేరకు ఎస్.జె.డబ్ల్యూ.హెచ్.ఆర్.సి. ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కమిటీ జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రెసిడెంట్ దత్తాద్రిగౌడ్, జిల్లా చైర్మెన్ డా.బి.సుధాకర్ మాట్లాడుతూ.. జాతీయ చైర్మెన్ డా.కొప్పుల విజయ్ కుమార్ ఆదేశాల మేరకు వంటశాలను, వంట సామగ్రిని తనిఖీ చేసినట్టు తెలిపారు. ఈ పరిశీలనలో అన్ని పరిశుభ్రంగా ఉండడంతో రోగుల దగ్గరికి వెళ్లి భోజనం ఏ విధంగా ఇస్తున్నారని వారిని అడిగి తెలుసుకున్నారు. సమయానికి రుచికరమైన భోజనం ఇస్తున్నారని రోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా చైర్మన్ సుధాకర్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బట్టి దత్తాద్రి గౌడ్, పట్టణ చైర్మన్ నలం రామాగౌడ్, జిల్లా వైస్ చైర్మన్ రాజు, చందు, కన్వీనర్ నరేష్, జక్రాన్‌పల్లి మండల ఎడ్యుకేషన్ చైర్మన్ కొప్పు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అవసరమున్న పనులు మాత్రమే చేపట్టాలి

- మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో అవసరం ఉన్న మరమ్మతు పనులను మాత్రమే చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని 16 పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ సోమవారం పరిశీలించారు. మండలంలోని అర్గుల్, జక్రాన్‌పల్లి, గాంధీనగర్, మునిపల్లి, లక్ష్మాపూర్, నల్లగుట్టతండా, లక్ష్మాపూర్, నారాయణపేట్ తదితర గ్రామాలలో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపడుతున్న పాఠశాలలను తనిఖీ చేసి పలు సూచనలు సలహాలను ఇచ్చారు. అన్ని పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం ఉందా లేదా, మరమ్మతు పనులు చేపట్టారా లేదా అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో సతీష్ కుమార్, ఏఐ సురేంద్ర వర్మ ఎంఈఓ శ్రీనివాస్, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పాఠశాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి

ఏక్‌భారత్ శ్రేష్టత క్యాంపులో పాల్గొన్న క్షత్రియ ఇంజనీరింగ్ విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని చేపూర్ శివారు క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఏక్ భారత్ శ్రేష్ఠత క్యాంపులో పాల్గొని ప్రతిభ కనపరచినట్టు కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈనెల 14 నుంచి 25వ తేదీవరకు మేడ్చల్ సిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ నిర్వహించిన జాతీయస్థాయి క్యాంపులో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న అరవింద్, సాయిప్రసాద్, అక్షిత్‌రెడ్డి 10 రోజుల క్యాంపులో పాల్గొని వచ్చినట్టు తెలిపారు. ఈ క్యాంప్ ముఖ్య ఉద్దేశం జాతీయ సమైక్యతకు పెద్దపీట వేస్తుందని మూడు రాష్ట్రాలకు చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ క్యాడెట్‌లను ఒకచోటకి చేర్చి వారి ప్రాంతము సంస్కృతి, సాంప్రదాయాలు, ఆహార అలవాట్లు, వేషాధారణ క్యాంపులో పాల్గొని రాష్ట్రాల చరిత్రను వివరించినట్టు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వారి సాంప్రదాయాలు తెలియ జేశారని, ఈ క్యాంపు ద్వారా విద్యార్థులు ఒక ప్రాంతం గురించి మరొక ప్రాంత విద్యార్థులకు పూర్తి అవగాహన వచ్చి రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్కే పాండే, వైస్ ప్రిన్సిపాల్ బి.నరేందర్, ఎన్సిసి అధికారి వెంకటేష్ తదితరులు జాతీయ సర్టిఫికెట్స్, మెడల్స్‌తో సత్కరించి అభినందించారు.


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

పెస్టిసైడ్స్ దుకాణాల్లో స్టాకు పరిశీలన


తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలో రైతు నేస్తం పెస్టిసైడ్స్ దుకాణంలో, సాటాపూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర పెస్టిసైడ్స్ దుకాణం స్టాకును వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ప్రతి డీలర్ విత్తనాలకు సంబంధించిన ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆయన సూచించారు. రైతులకు అందుబాటులో ఉండేలా విత్తనాల ధరను, స్టాకును సూచిక బోర్డుపై రాసి ఉంచాలని ఆయన వారికి ఆదేశించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు కచ్చితంగా రసీదులు ఇవ్వాలన్నారు. ఈ రసీదును పంట కాలం పూర్తయ్యేంత వరకు రైతులు రసీదును జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | మే 28, 2024 | www.navatelangana.com

మానవత్వం చాటుకున్న ఎం.ఎ.హకీమ్

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని జల్లాపల్లి ఆబాదీ గ్రామంలో తారాచంద్ నాయక్ అకాల మృతి చెందడంతో నిరుపేద కుటుంబానికి తనవంతు సహాయంగా కుటుంబ సభ్యులకు ఎం.ఎ.హకీమ్ సోమవారం రూ.10 వేలు అందజేశారు. అదే గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో ఫకీరా, బాబు, గోవింద్, ముగ్గురు కుటుంబ ఇండ్లపై కప్పులు ఈదుర గాలులతో పూర్తిగా లేచిపోవడంతో ముగ్గురు కుటుంబ సభ్యులకు రేకుల షెడ్డు పైకప్పు బొద్దు నిర్మించడానికి రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎం.ఎ.హకీమ్

కంకర కుప్పలను తొలగించిన చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని 26వ వార్డ్‌లోని వీక్లీ మార్కెట్ పోచమ్మ టెంపుల్ దగ్గర్లో గల ప్రకతి వనం ఎదుట కంకర కుప్పలు ఉండడంతో తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని మున్సిపల్ చైర్స్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియా చంద్రశేఖర్‌రెడ్డి స్పందించి అక్కడికి వెళ్లి ప్రజలకు ఇబ్బందిగా ఉన్న కంకర కుప్పలను మున్సిపల్ సిబ్బందితో తొలగించారు.


కంకర కుప్పలు తొలగింపు

నిఘా నేత్రాల నిర్వహణపై జాప్యమేలా..?

- నేరాలు చేధించటంలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

నవతెలంగాణ-పిట్లం

నిఘా నేత్రాల నిర్వాహణపై పోలీస్ వ్యవస్థ పట్టించుకోకుండా జాప్యం చేస్తున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా తోపాటు బస్టాండ్, నేతాజీనగర్ చౌరస్తా, ఆయా గ్రామపంచాయతీలలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణ బాధ్యతపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు మెండుగా వస్తున్నాయి.

ఒక్క నిఘా నేత్రం 100 మంది పోలీసులతో సమానమని ఉన్నతాధికారులు అభివర్ణిస్తున్నప్పటికీ మండల కేంద్రంలో ఏ ఒక్క నిఘానేత్రం పనిచేయడం లేదని సర్వత్రా విమర్శలు మెండుగా ఉన్నాయి. గతంలో నిఘా నేత్రాల పనితీరుతో మండల కేంద్రంలోని బిచ్కుంద రోడ్డులోని ఏటీఎం సెంటర్, బస్టాండ్ ఆవరణలోని ఓ బంగారం షాపులలో దొంగతనాలు జరగగా నిఘా నేత్రాలు కీలక పాత్ర పోషించడంతో దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పట్టుకుని కేసులను ఛేదించారు. ప్రస్తుతం పోలీసులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలోని గడ్డె గుండు తండా 161 జాతీయ రహదారి పక్కన గల అటవీ ప్రాంతంలో సగభాగము కాలిన యువతి శవం, బోల్లపల్లి మంజీరా వాగులో కొట్టుకొచ్చిన మహిళా శవం కేసులను పోలీసులు ఛేధించలేకపోయారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీస్ వ్యవస్థపై ఉన్నత అధికారులు పటిష్టపరిచి ప్రజలకు చేదోడు, వాదోడుగా నిలవాలని పలువురు కోరుకుంటున్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో పనిచేయని నిఘా నేత్రం

మంచి పోలీసింగ్ అందించాడానికి కృషి..

జూన్ నాలుగవ తారీకు తర్వాత ప్రజలతో మమేకమై నూతన నిఘా నేత్రాలతో పాటు పనిచేయని నిఘా నేత్రాలను మరమ్మతులు చేసి పోలీసులలో భాగంగా మంచి పోలీసింగ్ అందించడానికి కృషి చేస్తున్నాం. జనరల్, అసెంబ్లీ ఎన్నికలలో పోలీసులు బిజీగా ఉండటంతో జాప్యం జరిగింది. నిఘా నేత్రాల మానిటరింగ్ నిమిత్తం కోసం కొంత ఫండ్ అవసరం. ప్రజల సహకారంతో రిపేర్ చేయించి కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా పునర్నిర్మాణం చేయించడానికి కషి చేస్తాం. జనరల్ ఎన్నికలుండటంతో మీటింగ్‌లు పెడితే వైలేషన్ అవుతాయని మీటింగ్‌లు పెట్టకపోవడం, వర్షాలు, ఈదురు గాలులు, కోతుల బెడతతో వైర్లు తెగిపోవడంతో ఫండ్స్ లేని కారణంగా రిపేర్ చేయించలేకపోయాం. మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ, బయటి వ్యక్తుల సహకారంతో తొందరలో రిపేర్ చేయిన్నాం.

- సత్యనారాయణ, బాన్సువాడ రూరల్ సిఐ

'నిధి ఆప్కే నికత్ 2.0'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పింఛన్‌దారుల, పీఎఫ్ చందదారులు కోసం ప్రతినెల 27న నిర్వహించనున్న నిధి ఆప్కే నికత్ 2.0 కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రావణ్ కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రమన్ భాయి సీ పటేల్ బీడీ కంపెనీలో నిధి ఆప్కే నికత్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించి అనేక మంది సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. ఈపీఎఫ్ఓ సంస్థల వివిధ ప్రయోజనాలు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే విధానం, అర్హత, అవసరాలపై కేవైసీ అనుసంధానం, చందదారుల పేర్ల మార్పిడి, ఈడిఎల్ఐ ఇన్సూరెన్స్ ఆరవత ప్రయోజనాలపై సిహెచ్‌వో శ్రవణ్ కుమార్ వివరించారు. ప్రతినెల నిర్వహించే సదస్సులో పరిష్కరించే సమస్యల గురించి పింఛనుదారులు, పీఎఫ్ చందదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎ.బాలనాథ్, బి.ప్రవీణ్‌లాల్ పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం



నవతెలంగాణ-కామారెడ్డి

మండలంలోని రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన లింగ అఖిల్ (28) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. 23.5.2024న సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంట్లో ఉన్న భార్య అయిన రమ్యతో తాను బైక్ రిపేర్ చేయించుకొని వస్తానని చెప్పి అతని తండ్రి చంద్రం టీవీఎస్ ఎక్సెల్ తీసుకొని కామారెడ్డికి వెళ్లాడు. కామారెడ్డిలో రైల్వేస్టేషన్ పార్కింగ్లో టీవీఎస్ ఎక్సెల్‌ను పెట్టి అక్కడి నుంచి వెళ్లాడు. ఫోన్ చేస్తే హైదరాబాద్ వెళ్లినా అని చెప్పి.. ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. ఆ తర్వాత తిరిగి ఇంటికి రాలేదు. భార్య రమ్యశ్రీ సోమవారం కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సిఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇతని ఆచూకీ తెలిసిన ఎవరైనా కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పేద మహిళల సొమ్ము నొక్కేశారు

- పూర్తిస్థాయి విచారణలో పర్యవేక్షణ లోపం

నవతెలంగాణ-ఆర్మూర్

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సమైక్యల ద్వారా బ్యాంకుల నుంచి వచ్చే రుణాలను తమ సొంత పనులకు వాడుకుంటూ పేద మహిళల సొమ్ము నొక్కేస్తున్నారు. మున్సిపల్‌కు చెందిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా (శ్రీనిధి) డబ్బుల్లో గోల్‌మాల్ జరిగి ఇద్దరు ఆర్పీలు సస్పెండ్ కావడం చర్చనీయాంశం అయ్యింది. రూ.35 లక్షల గోల్‌మాల్‌పై నెల నెల డబ్బులు కూడపెట్టుకుంటున్న పేద మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలోని..

జిల్లాలోని బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్‌తో పాటు జిల్లా కేంద్రంలో రోజువారి పనులు చేసుకునే మహిళ సభ్యులు తాము ఆర్థికంగా ఎదిగేందుకు సమైక్యాల రుణాలు పొందుతున్నారు. లెక్క తేలని సొమ్ము ఆర్పీలు సొంతానికి వాడుకుంటున్నారు. వీరి పనితీరును పర్యవేక్షించాల్సిన సీఈవోలు, ఆపై స్థాయి అధికారులు చూసీచూడనట్లు ఉండడంతో అక్రమాలు చోటుచేసుకుంటున్నవి. సిబ్బంది ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తుండడంతో అక్రమాలకు ఆస్కారం ఏర్పడిందని పలువురు మహిళలు నవతెలంగాణకు తెలిపారు. కాగా కొందరు ఆర్పిలకు రాజకీయ పలుకుబడి ఉండడంతో అధికారులు వారి జోలికి వెళ్లడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. మెప్మాలో టీఎంసీలు, సిఓలు అనేక సంవత్సరాల తరబడి ఒకే చోట పనిచేస్తున్న వారిని కదిలించే నాథుడే లేకుండా పోయాడని, వారిపై అజామాయిషీ లేకపోవడంతో అక్రమాలకు తెర లేపుతున్నారు.

ఐకెపిలో సైతం..

ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సమైక్యల ద్వారా బ్యాంకుల నుంచి ఇచ్చే రుణాలను కొందరు వివోఏలు 30 లక్షలతో ఉడాయించిన ఘటన బాల్కొండలో గత కొద్ది సంవత్సరాల క్రితం జరగడం తీవ్ర సంచలనం అయింది. మెండోరా మండలంలోని ఎల్కుటూర్ గ్రామంలో సైతం ఓ వీవోఏ 30 లక్షల వరకు రుణాలను స్వాహా చేశారు. ఈ వ్యవహారం అధికారుల దష్టికి వెళ్లినా.. రికవరీకి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు అప్పట్లో సంచలనం రేపాయి.

బాల్కొండ మండల కేంద్రంలోనూ ఉండే ఒక వీవోఏ బ్యాంకు నుంచి మహిళా సంఘం సభ్యులు రుణాలు ఇప్పించారు. వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించారు. కాగా తిరిగి అవే రుణాలను తప్పుడు డాక్యుమెంట్లతో 2013-14 సంవత్సరంలో మహిళా సంఘాల సభ్యులకు తెలియకుండానే రుణం తీసుకోవడం జరిగింది. ఇది జరిగిన సంవత్సరం తర్వాత బయట పడడంతో మహిళా సంఘాల సభ్యులు పోలీస్ స్టేషన్లో సైతం ఫిర్యాదు చేశారు.

కలెక్టర్ స్పందించాలి..

తాము లోను తీసుకోకుండానే నోటీసులు ఇవ్వడంతో సభ్యులు, ఆర్పీలను ప్రశ్నించడం.. లక్షల్లో గోల్‌మాల్ తతంగం జరగడం క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని మెప్మా జిల్లా అధికారితో పాటు జిల్లా కలెక్టర్ స్పందించాలని పలువురు సభ్యులు సోమవారం నవ తెలంగాణకు తెలిపారు.

విత్తన ఎరువుల దుకాణాల తనిఖీ



తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని ఎరువుల, విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి సోమవారం తనిఖీ చేశారు. దుకాణంలో గల విత్తన, ఎరువు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రసీద్ ఇవ్వాలని యజమానులకు సూచించారు. స్టాక్ రిజిస్టర్‌ను తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీరామ రైతురాజ్యం సీడ్స్, ఫెస్టిసైడ్, పల్లవి ఏజెన్సీ దుకాణాలలో తనిఖీ నిర్వహించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

- మండల ప్రత్యేక అధికారి యోహాన్


సూచనలు చేస్తున్న ప్రత్యేకాధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ పాఠశాల పనులను డిచ్‌పల్లి మండలంలోని ఘన్పూర్, పోలీస్ క్యాంప్, నడిపల్లి గ్రామ పంచాయతీలలోని ప్రభుత్వ పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి యోహన్, ఎంపీఓ శ్రీనివాస్ గౌడ్, ఏఈ పిఆర్ శ్రీధర్‌తో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో అవసరమైన పనులు కాంట్రాక్టర్ చేపట్టి ఆ పనులను ఎలాంటి వృథా ఖర్చు లేకుండా మంచి నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎక్కడ పనుల్లో లోపాలు లేకుండా చూసుకోవాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఆయాగ్రామాల వీవోఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో పొరపాట్లకు ఆస్కారం ఉండొద్దు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- సీపీతో కలిసి కౌంటింగ్ సెంటర్ పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. డిచ్‌పల్లిలోని సీఎంసీ కళాశాలలో కొనసాగనున్న ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని కలెక్టర్ సోమవారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో కలిసి కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలించారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను నిశితంగా పరిశీలన జరిపారు. కౌంటింగ్ హాళ్లలో ఏర్పాటు చేసిన టేబుళ్లు, బారికేడ్లు, సిసి కెమెరాలు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏ చిన్న తప్పిదానికి సైతం తావులేకుండా కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.


కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మానాల మోహన్‌రెడ్డి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రానికి చెందిన జుంగల పెద్దగంగారాం తండ్రి జుంగల కర్రెన్న ఇటీవలే మరణించడంతో అతని కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేండ్ల రమేష్, మైనార్టీ మండల అధ్యక్షులు మునీరోద్దీన్, కాంగ్రెస్ నాయకులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, రొక్కాడ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్‌లో పెద్దమ్మ బోనాలు


బోనాల ఊరేగింపులో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ బోనాలు సోమవారం తీశారు. ప్రతి సంవత్సరం మే చివరలో పెద్దమ బోనాలు తీస్తామని ముదిరాజ్‌లు తెలిపారు. అందులో భాగంగానే ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లికి ఇంటింటికి బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు సప్పుళ్లతో పోతరాజుల విన్యాసం, శివసత్తులు పూనకాలతో ఊరేగింపు కొనసాగింది. పెద్దమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు కొనసాగింది. అమ్మవారికి ఓడి బియ్యం పోసి నైవేద్యం సమర్పించారు.

వ్యవసాయాధికారుల తనిఖీలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ రూరల్‌లోని పాల్డ, పాంగ్ర గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు డీలర్ షాపులను సోమవారం తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా రైతులకు వ్యవసాయ క్షేత్రంలో సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఏడిఏ పిండి ప్రదీప్, నిజామాబాద్ రూరల్ వ్యవసాయ అధికారి హీరా జాదవ్ మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో రైతులు లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దని తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే దుకాణాల నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని వివరించారు. విత్తన ప్యాకెట్, బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని అన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. బిల్లు మీద విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ నెంబర్, లాట్ నెంబర్, రేటు ఉండాలని అన్నారు. విత్తన ప్యాకెట్ మీద తయారైన తేదీ, కాలం ముగిసిన తేదీ చూసుకోవాలని, గ్రామాలలో తక్కువ ధరకు, ఎక్కువ ధరకు అమ్మేవారి వివరాలు మండల వ్యవసాయ అధికారికి చెప్పాలన్నారు. పక్క జిల్లా నుంచి పక్క, రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి ఎవరైనా నకిలీ విత్తనాలు, లూస్ విత్తనాలు అమ్మినచో మాకు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు. తొందరపడి అధీకత (లైసెన్స్) డీలర్ దగ్గర కాకుండా ఇతరుల దగ్గర విత్తనాలు తీసుకొని ఇబ్బంది పడకూడదని రైతులను కోరారు. కార్యక్రమంలో ఏఈఓ స్వాతి లత, మాధవ నగర్ సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు, సీఈఓ కష్ణ పాల్గొన్నారు.


తనిఖీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి

విద్యుత్ షాక్‌తో ఉపాధి కూలీ మృతి



నవతెలంగాణ-వర్ని

విద్యుత్ షాక్‌తో ఉపాధి కూలీ మతిచెందాడు. ఈ ఘటన రుద్రూర్ మండలం రాయకూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం వీచిన గాలివానకు రుద్రూర్ మండలం రాయకూరు క్యాంపు గ్రామ శివారులోని మురళీకష్ణ అనే రైతు వ్యవసాయ పొలంలో కరెంటు స్తంభంపై చెట్టు కూలీ, స్తంభం, తీగలు నేలపై పడ్డాయి. సోమవారం ఉదయం 9 గంటలకు అక్కడ ఉపాధి హామీ పని కోసం రాయకూర్ గ్రామానికి చెందిన ఉపాధి కూలి షేక్ లతీఫ్ (29) వెళ్లాడు. ఆ విద్యుత్ తీగలను గమనించకపోవడంతో కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. లతీఫ్ తండ్రి షబ్బీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్ఐ అప్పారావు దర్యాప్తు చేపడుతున్నారు.

వరి కొనుగోలు పూర్తిచేసాం

- తహసీల్దార్ హిమబిందు



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని అన్ని వరి కొనుగోలు కేంద్రాలలో వరిపంట తూకం వేసే ప్రక్రియ సోమవారం నాటికి పూర్తిచేశామని జుక్కల్ తహసీల్దార్ హిమబిందు సోమవారం తెలిపారు. మండలంలోని నాలుగు కేంద్రాలలో వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రారంభించామని, అన్ని కేంద్రాలలో కలెక్టర్ ఆదేశానుసారం రోజు వారి టార్గెట్ పూర్తి చేసి లారీలలో మిల్లర్లకు తరలించామని తెలిపారు. ప్రస్తుతం అన్ని సెంటర్ల టార్గెట్ పూర్తయిందని, మంగళవారం నుంచి కొనుగోలు నిలిపి వేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

ఉత్తమ ఆక్టివిటీస్ ప్రశంసపత్రం అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పరమళ్ల గ్రామానికి చెందిన లెక్కల రాజుకు సోమవారం సమాచార హక్కు చట్టం ఉత్తమ ఆక్టివిటీస్ ప్రవేశపత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు రాజన్న చేతుల మీదుగా అందజేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డైరీ టెక్నాలజీ కళాశాలలో సమాచార హక్కు చట్టం, జాతీయ మానవ హక్కుల చట్టంపైన ఉచిత శిక్షణ శిబిరం, అవగహన సదస్సులో సమాచార హక్కు చట్టం రాష్ట్ర జోనల్ ప్రధాన కార్యదర్శి లెగ్గేల రాజుకు ఆర్టిఏ, ఎన్‌హెచ్ఆర్‌సి ఉత్తమ యాక్టివిటీస్‌గా ప్రశంస పత్రాన్ని ఆర్‌టిఐ రాష్ట్ర అధ్యక్షులు రాజన్న, ఆర్టిఏ రాష్ట్ర డైరెక్టర్ సలీమ్, ఎన్‌హెచ్‌ఆర్‌సి రాష్ట్ర చైర్మన్ సాహెల్ ఖాన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్టిఏ జోనల్ అధ్యక్షులు ప్రదీప్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, కామరెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు షబానా, జిల్లా ఉపాధ్యక్షులు అలీమ్, జిల్లా ఈసీ మెంబర్ లింగమయ్య, జిల్లా కార్యదర్శి రతన్, శ్రీనివాస్, విద్యార్థిని, విద్యార్థులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసపత్రం అందుకున్న రాజు